రోడ్డుకు మరమ్మతు ఏదీ?



భారీ వర్షానికి కోతకు గురైన గాదిగూడ మండలంలోని కొలామా రోడ్డు (ఫైల్)



మరమ్మతుకు నోచుకోని నార్నూర్ మండలంలోని మాదాపూర్‌రోడ్డు

- భారీ వర్షాలతో తెగిన రోడ్లు, వంతెనలు
- రాకపోకలకు ఇబ్బందులు
- ఇక్కట్లు పడుతున్న ప్రజలు

నార్నూర్: దశాబ్దాల క్రితం నిర్మించిన రహదారుల మరమ్మతుకు నోచుకోలేదు. దీంతో అవి శిథిలమై ప్రయాణం నరకప్రాయంగా మారింది. చిన్నపాటి వర్షం కురిస్తే చాలు రోడ్లన్నీ కోతకు గురవుతున్నాయి. రాకపోకలు సాగించే వాహనదారులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికే తారు రోడ్లు ఆనవాళ్లు కనిపించడం లేదు. గుంతల రోడ్ల వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. గాదిగూడ మండలంలోని కొలామా, తోయగూడ, హీరాపూర్, చిత్తగూడ, బొడ్డిగూడ, ఖండోవ్ కట్టగూడ, పున్నగూడ, డాబా పున్నగూడ రోడ్లు గతంలో కురిసిన భారీ వర్షాలకు కోతకు గురయ్యాయి. రోడ్డుపై వంతెనలు తెగిపోవడంతో వాహనాలు రాకపోకలు వెళ్లలేని పరిస్థితి. అనేక చోట గుంతలు ప్రమాదకరంగా మారాయని గూడెం, తండాప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నార్నూర్ మండలంలోని బాబేఝరి, చిత్తగూడ, మాల్లెపూర్ చిత్తగూడ, దేవపాటర్ రోడ్లపై ఏర్పడిన గుంతల వల్ల రాకపోకలకు ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. రోడ్ల మరమ్మతుకు ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించాలని ఆదివాసీ గిరిజనులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజన గ్రామాలకు మెరుగైన రోడ్డు రవాణా సౌకర్యాలు కల్పించడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. ఇటీవల భారీ వర్షానికి కోత గురైన రోడ్ల మరమ్మతు కోసం ప్రత్యేక నిధులు కేటాయించి మరమత్తు చేయిస్తాం.

– ఖుష్బూ గుప్తా, ఐటీడీఏ పీవో

ఘనంగా కొంచవలి దర్గా జాతర



దర్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే



భక్తులకు వడ్డిస్తున్న గ్రామస్తులు

తాంసి: భీంపూర్ మండలం అర్లి(టి) శివారులో గుట్టపై ఉన్న కొంచవలి దర్గా జాతర మంగళవారం ఘనంగా నిర్వహించారు. వివిధ గ్రామాలు, మహారాష్ట్ర నుంచి భక్తులు తరలివచ్చారు. ఎమ్మెల్యే అనిల్‌జాదవ్, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి వేర్వేరుగా ప్రార్థనలు చేశారు. ఎమ్మెల్యే.. దర్గా వద్ద చాదర్‌ను సమర్పించారు. దర్గా అభివృద్ధికి నిధులు కేటాయిస్తానన్నారు. అనంతరం గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో జొన్నగట్కా, మటన్‌తో భోజనం ఏర్పాటు చేశారు. సభ్యుడు నవీన్, మాజీ జెడ్పీటీసీ సుధాకర్, బీఆర్ఎస్ కన్వీనర్ నాగయ్య, నాయకులు నితిన్, గంగయ్య, అఫ్రోజ్, ఉల్లాస్ పటేల్, సంజీవ్‌రెడ్డి, అనిల్, సంతోశ్, లింబాజీ తదితరులు పాల్గొన్నారు.

దర్గా ప్రసాదం..జొన్న గట్కా, మాంసం

కొంచవలి దర్గా జాతరలో మాత్రం భక్తులకు జొన్న గట్కా, మేక మాంసం అందించడం ఏళ్లుగా ఆనవాయితీ. గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో సుమారు 2వేలకు పైగా భక్తులకు నాలుగు క్వింటాళ్ల గట్కా, మేక మాంసం వండి ప్రసాదంగా అందజేశారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

నేరడిగొండ: ప్రతిఒక్కరూ ఆధ్యాత్మికతతో మెలగాలని, అప్పుడే మానసిక ప్రశాంతత లభిస్తుందని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. ఆయన స్వగ్రామమైన రాజురా గ్రామంలో గల జగదాంబ దేవి సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ ఆలయంలో మంగళవారం పూజలు, హోమం నిర్వహించారు.

గ్రంథాలయం ఏర్పాటు అభినందనీయం

తాంసి: యువత చదువుపై దృష్టిసారించేలా గ్రామస్తులు కలిసికట్టుగా గ్రంథాలయం ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మండలంలోని కప్పర్ల గ్రామంలో గ్రామస్తులు తలకొంత డబ్బులు పోగుచేసి రూ.10 లక్షలతో ఏర్పాటు చేసుకున్న గ్రంథాలయాన్ని మంగళవారం సందర్శించారు. పోటీపరీక్షల పుస్తకాల కోసం తనవంతుగా రూ.50వేలు అందిస్తానని ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం ఎమ్మెల్యేను సన్మానించారు. మాజీ మార్కెట్ డైరెక్టర్ మహేందర్, నాయకులు వినోద్‌రెడ్డి, సంతోశ్, నాగారెడ్డి, ఉత్తం ఉన్నారు.

ఉపాధ్యాయుల సంక్షేమానికి కృషి

బోథ్: ఉపాధ్యాయుల సంక్షేమానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. బజార్‌హత్నూర్ మండల పీఆర్టీయూ అధ్యక్షుడిగా ఎన్నికైన సోనాల వాసి కటకం చంద్రకాంత్‌ను మంగళవారం సన్మానించారు. మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

సికిల్‌సెల్ నియంత్రణకు కృషి



పరిశీలిస్తున్న ప్రోగ్రాం అధికారి శ్రీధర్

నేరడిగొండ: సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధి నియంత్రణకు వైద్య శాఖ కృషి చేస్తుందని జిల్లా మలేరియా, సికిల్‌సెల్ ప్రోగ్రాం అధికారి మెట్‌పెల్లివార్ శ్రీధర్ అన్నారు. కలెక్టర్ ఆదేశాలతో మంగళవారం నేరడిగొండ పీహెచ్‌సీ పరిధిలోని తేజాపూర్ సబ్‌సెంటర్‌లో గల చించోలి గ్రామాన్ని సందర్శించారు. సికిల్‌సెల్ ఎనీమియా స్క్రీనింగ్ వివరాలపై ఆరా తీశారు. గతేడాది డిసెంబర్‌లో గ్రామంలో 194 మందికి స్క్రీనింగ్ చేయగా, నలుగురికి సికిల్‌సెల్ ఎనీమియా నిర్ధారణ అయినట్లు తెలిపారు. 50 మందిని క్యారియర్లుగా గుర్తించి కౌన్సెలింగ్ ఇవ్వాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి సద్దాం, హెచ్ఈఓ పవార్ రవీందర్, ఎంఎల్‌హెచ్‌పీ వైష్ణవి, ఏఎన్ఎం రాణి, హెచ్ఏలు సాయన్న, శ్రీనివాస్ ఉన్నారు.

బాధ్యతల స్వీకరణ



సత్యానారాయణరావుకు పుష్పగుచ్ఛం ఇస్తున్న సిబ్బంది

ఇచ్చోడ: తహసీల్దార్‌గా సీహెచ్ సత్యనారాయణరావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. బాధ్యతలు చేపట్టిన ఆయనకు డిప్యూటీ తహసీల్దార్ జాదవ్ రమేశ్, ఆర్ఐ హుస్సేన్, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి సన్మానించారు.

స్వచ్ఛంద రక్తదానానికి ముందుకు రావాలి



యువకులకు జ్యూస్ అందిస్తున్న డైరెక్టర్

ఆదిలాబాద్‌టౌన్: స్వచ్ఛంద రక్తదానానికి యువత ముందుకు రావాలని రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ అన్నారు. స్మైల్ సొసైటీ అధ్యక్షుడు కేమ శ్రీకాంత్ జన్మదినాన్ని పురస్కరించుకుని మంగళవారం రిమ్స్‌లోని బ్లడ్‌బ్యాంక్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. దాదాపు 30 మంది యువకులు రక్తదానం చేయగా, వారికి జ్యూస్ అందజేసి అభినందించారు. మహ్మద్ రఫీ, సాయి గౌడ్, కిరణ్, విశాల్, సురేశ్, రామకృష్ణ, రాజు, రాకేశ్, శశికాంత్, రాహుల్, రాధాకృష్ణ, మోతిలాల్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ)లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ప్రకటనలో తెలిపారు. ఇదివరకు నాలుగు విడతల్లో సీట్లు కేటాయించామని, ఐదో విడత కౌన్సెలింగ్ కోసం 23 నుంచి 28 వరకు వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. గతంలో వివరాలు నమోదు చేసుకున్నవారు మళ్లీ చేసుకోవాల్సిన అవసరం లేదని తెలిపారు. ఆసక్తిఉన్న వారు ఐటీఐ వాక్ఇన్ అడ్మిషన్ల కోసం 25 నుంచి 28 తేదీ వరకు కళాశాలలో ఉదయం 10 గంటల నుంచి సంప్రదించాలని సూచించారు. వివరాలకు సెల్ 9493535378 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

పాఠశాల తనిఖీ



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎంపీడీవో

తాంసి: భీంపూర్ మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలను ఎంపీడీవో గోపాలకృష్ణ రెడ్డి మంగళవారం తనిఖీ చేశారు. పాఠశాల ఆవరణను పరిశీలించారు. విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం నాణ్యత లేకపోవడంతో నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తర్వాత విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఉపాధ్యాయులు శ్రీకాంత్, మహేందర్ ఉన్నారు.

మెడికల్ ఎడ్యూకేషన్ శిక్షణ ప్రారంభం

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్‌లోని బోధన సిబ్బందికి మంగళవారం మెడికల్ ఎడ్యూకేషన్ శిక్షణ తరగతులను రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏఎంసీ నిబంధనల మేరకు విద్యార్థులకు బోధన చేయడానికి అవసరమైన మెలకువలను మూడు రోజుల పాటు నేర్పించనున్నట్లు పేర్కొన్నారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కబ్జా స్థలంపై విచారణ



విచారణ చేపడుతున్న అధికారులు

ఇచ్చోడ: మండల కేంద్రంలోని టీచర్స్‌కాలనీకి వెళ్లే సిరిచెల్మ రోడ్డు కబ్జాకు గురికాగా, కాలనీవాసుల ఫిర్యాదుతో డీఎల్‌పీవో ఫణిందర్‌రావు, తహసీల్దార్ సీహెచ్ సత్యానారాయణరావు మంగళవారం విచారణ చేపట్టారు. కాలనీవాసులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పంచాయతీకి సంబంధించిన రోడ్డు నిర్మాణంలో ఉందని తెలిపారు. పంచాయతీ రికార్డులను పరిశీలించారు. అనంతరం కలెక్టర్‌కు నివేదిస్తామని వారు తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ జాదవ్ రమేశ్, ఆర్ఐ హుస్సేన్, ఎంపీవో సత్యానంద్, పంచాయతీ ఈవో సూర్యప్రకాశ్, మాజీ సర్పంచ్ నారాయణ ఉన్నారు.

అసలేం జరిగింది..

టీచర్స్‌కాలనీకి వెళ్లే రోడ్డును సంబంధిత పట్టేదారు గతంలో కేశవపట్నం గ్రామానికి చెందిన వ్యక్తికి విక్రయించారు. తాత్కాలికంగా షెడ్డు వేశారు. కొన్నిరోజుల తర్వాత షెడ్డు వెనుక భాగంలో శాశ్వత నిర్మాణ పనులు చేపట్టారు. దీంతో కాలనీవాసులు ఫిర్యాదుతో అధికారులు నోటీసులు ఇచ్చి షెడ్లను తొలగించారు. గత ఐదేళ్ల నుంచి రోడ్డు కబ్జా వివాదం కొనసాగుతోంది.

రైతులకు ‘కర్షకమిత్ర’ రుణాలు

- డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి



మాట్లాడుతున్న భోజారెడ్డి

తాంసి: ప్రాథమిక సహకార సంఘాల ద్వారా రైతుల కోసం కర్షకమిత్ర పథకం ద్వారా రూ.10 లక్షల రుణాలు అందిస్తున్నట్లు డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి తెలిపారు. మండల కేంద్రంలో పీఏసీఎస్ కార్యాలయంలో మంగళవారం మహాజనసభ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల కోసం ఏడీసీసీ బ్యాంక్ అన్ని రుణాలు తక్కువ వడ్డీ రేట్లకు ఇస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణ కోసం గరిష్టంగా రూ.50 లక్షల వరకు వ్యవసాయ భూమిపై రుణాలు అందిస్తున్నామన్నారు. మూడెకరాల రైతులకు ట్రాక్టర్, ఇతర వాహనాల కొనుగోలుకు రుణాలు అందిస్తామని తెలిపారు. విదేశాలకు వెళ్లే రైతుల పిల్లలకు విద్యారుణం అందిస్తున్నామన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్ ధనుంజయ్, సీఈవోకేశవ్, డైరెక్టర్లు సంతోశ్‌రెడ్డి, చంద్రన్న, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి కోసం రైతుల రాస్తారోకో



రాస్తారోకో చేపట్టిన రైతులు

బజార్‌హత్నూర్: పత్తి, మొక్కజొన్న పంటలకు సాగునీరందించాలని ఇచ్చోడ, సొనాల ఆర్అండ్‌బీ రోడ్డు వద్ద బజార్‌హత్నూర్, గిర్నూర్, కాండ్లీ రైతులు మంగళవారం రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాగునీరు లేక ఖరీఫ్‌లో వేసిన పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బజార్‌హత్నూర్ సాగునీటి ప్రాజెక్టు నుంచి నీరు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాస్తారోకో విషయం తెలుసుకున్న పోలీసులు, నీటిపారుదల శాఖ ఏఈ తిరుపతి అక్కడికి చేరుకున్నారు. రైతులతో మాట్లాడి శాంతింపజేశారు. ఏఈ తిరుపతి.. ప్రాజెక్టు వద్దకు చేరుకుని ఎడమ, కుడి కాలువలకు నీటిని విడుదల చేయడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు.

ఘనంగా ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ వేడుకలు



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ అతీఖ్ బేగం

నేరడిగొండ/బోథ్/ఇచ్చోడ/నార్నూర్/ఆదిలాబాద్‌టౌన్/ఉట్నూర్‌రూరల్: జిల్లా వ్యాప్తంగా జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ఆవిర్భావ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ యువత దేశ సేవలో ముందుండాలన్నారు. నేరడిగొండ జూనియర్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎం.స్వామి, ప్రిన్సిపాల్ షబాన తరన్నుం, లెక్చరర్లు, బోథ్‌లోని వాగ్దేవి జూనియర్, డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాళ్లు ప్రవీణ్‌రెడ్డి, విఠల్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి బోనగిరి కార్తీక్, ఇచ్చోడ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ శంకర్, సత్యానారాయణ రావు, నార్నూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రోగ్రాం అధికారి బాలాజీ, ఆదిలాబాద్‌లోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ అతీఖ్ బేగం, ఎన్ఎస్ఎస్ అధికారులు యాఖుబ్‌అలీ, పృథ్వీరాజ్, వలంటీర్లు, ఉట్నూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ ప్రతాప్‌సింగ్ పాల్గొన్నారు. అదేవిధంగా ఉట్నూర్ డిగ్రీ కళాశాలలో టాస్క్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఓరియంటేషన్‌నిర్వహించారు. ఆసిఫాబాద్ రీజినల్ హెడ్ సాయికుమార్ అవగాహన కల్పించారు. అధ్యాపకులు సాయి, నర్సింగ్‌రావు, రాజశేఖర్, రవీందర్, కరుణాకర్ ఉన్నారు.

హమాలీలకు ఉపాధి కల్పించాలి

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో ప్రారంభం కానున్న సోయా కొనుగోళ్లలో హమాలీలందరికీ పని కల్పించాలని క్రాంతికారి హమాలీ సొసైటీ డైరెక్టర్ సంతోష్ అన్నారు. మంగళవారం అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, మార్కెటింగ్ ఏడీ గజానంద్‌లకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హమాలీ వృత్తి చేసుకుంటున్న తమకు ఉపాధి కల్పించి ఆదుకోవాలని కోరారు. ఈ సందర్భంగా మార్కెటింగ్ ఏడీని సన్మానించారు. విఠల్, అఫ్రోజ్ హుస్సేన్, రసూల్, సంతోష్, మునేశ్వర్, నవీద్, జహీర్ ఖాన్, సంజయ్, సీతారాం, బాలాజీ, మసూద్, అంజద్ హుస్సేన్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన నాయకుల

ఉట్నూర్‌రూరల్: టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్‌ను ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు ఆధ్వర్యంలో నాయకులు మంగళవారం హైదరాబాద్‌లో కలిశారు. ఈ సందర్భంగా ఆయన్ను సన్మానించారు. దాసండ్ల ప్రభాకర్, అన్సార్ అలీ, నిసార్, ముబీన్, తదితరులు ఉన్నారు.

‘హామీల అమలులో విఫలం’

తలమడుగు: ఆరు గ్యారంటీల హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని, రేవంత్‌రెడ్డిది మాటల గారడి ప్రభుత్వమని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మండిపడ్డారు. సుంకిడి గ్రామంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. హామీల అమలు చేయకుండా ప్రజలను మోసగిస్తోందన్నారు. రూ.2 లక్షల రుణమాఫీ పూర్తి కాలేదన్నారు. గ్రామంలో ఏళ్లుగా మార్కెట్ యార్డ్‌కు బీఆర్ఎస్ హయంలో స్థలాన్ని కేటాయించగా ఇప్పటివరకు ఆ ఊసే లేదని అన్నారు. నాయకులు వెంకటేశ్, తిరుమల గౌడ్, అబ్దుల్లా, శ్రీనివాస్ తదితరులున్నారు.

పీఆర్టీయూ మండల కార్యవర్గం

నార్నూర్(గాదిగూడ): గాదిగూడ మండల పీఆర్టీయూ (టీఎస్) నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా మెస్రం లింగు మూడోసారి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి రమణ తెలిపారు. ప్రధాన కార్యదర్శిగా జుగ్నక తుకారం, అసోసియేట్ అధ్యక్షుడిగా మోహన్, మహిళా అధ్యక్షురాలిగా గీత కుడ్మెత, కార్యదర్శిగా మెట్ట బాబు ఎన్నికయ్యారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కూడల రవీందర్, ఎంఈవో రావపల్లి ఆశన్న, సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మేస్రం శేఖర్ పాల్గొన్నారు.

సన్మానం

కైలాస్‌నగర్: తెలంగాణ బీసీ ఫెడరేషన్ కులాల సమితి సబ్బండ వర్గాల సంబరం కార్యక్రమాన్ని మంగళవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించారు. సమావేశంలో బీసీ సామాజిక వర్గాల కార్పొరేషన్ చైర్మన్లకు ఆత్మీయ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కాంగ్రెస్ అనుబంధ షిషరీస్ జిల్లా చైర్మన్, పార్టీ పట్టణ అధ్యక్షుడు నగేశ్‌ను సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి సత్కరించి అభినందించారు.

క్రీడల్లో గురుకుల విద్యార్థినుల ప్రతిభ

ఉట్నూర్‌రూరల్: వరంగల్ కాకతీయ యూనివర్సిటీలో ఈనెల 21 నుంచి 23 వరకు జరిగిన ఇంటర్ కాలేజీమీట్ టోర్నమెంట్ విభాగంలో ఉట్నూర్ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల విద్యార్థినులు ప్రతిభ చాటారు. చెస్‌లో మల్లీశ్వరి, ద్రుపత, రాశికల, జ్యోతి, ప్రథమ స్థానం కైవసం చేసుకున్నారు. పరుగు పందెంలో లక్ష్మి, భీంబై, మహేశ్వరి, లావణ్య, ప్రియాంక, అనిత, రెండవ స్థానాన్ని కై వసం చేసుకున్నారు. విద్యార్థినులను ప్రిన్సిపాల్ హరిత, అధ్యాపకులు మంగ అభినందించారు.

ఓటరు నమోదులో తప్పులు సరిచేయాలి

ఇచ్చోడ: ఇచ్చోడ మేజర్ పంచాయతీ 16 వార్డులో ఓటరు నమోదులో తప్పాలను సరిచేయాలని బీజేపీ నాయకులు కోరారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ సత్యానారయణ రావుకు వినతిపత్రం అందజేశారు. బోథ్ అసెంబ్లీ ఇన్‌చార్జి బాబారావు, బీజేపీ జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, మండల అధ్యక్షులు కేంద్రే నారాయణ, కార్యదర్శి రమేశ్ ఉన్నారు.

పాఠశాలలో వైద్యశిబిరం

ఇంద్రవెల్లి: పాటగూడ గ్రామంలో ఏకలవ్య మోడల్ గురుకుల పాఠశాలలో మంగళవారం పిట్టబొంగరం పీహెచ్‌సీ వైద్యుడు ప్రతాప్‌నాయక్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. వైద్యురాలు పూజిత, ప్రిన్సిపాల్ సౌరభం, వైస్ ప్రిన్సిపాల్ రేఖరాణి, మాజీ సర్పంచ్ కోరెంగా సుంకట్‌రావ్, హెచ్‌ఈవో రాథోడ్ గోకుల్, హెల్త్ సూపర్‌వైజర్ గంగమ్మ ఉన్నారు.

ఎంపల్లిలో..

నార్నూర్: ఎంపల్లిలో పీహెచ్‌సీ వైద్యాధికారి రాంబాబు ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. 50 మంది రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందించారు. అనంతరం గ్రామంలో డ్రైడే నిర్వహించారు. వైద్యులు జితేందర్‌రెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ చౌహాన్ చరణ్‌దాస్, హెచ్‌ఈ తులసిదాస్ రాథోడ్ తదితరులు ఉన్నారు.

నేరడిగొండ: పీచర గ్రామంలో పలువురికి వైద్య సిబ్బంది వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. హెల్త్ సూపర్‌వైజర్ సంతోష్, హెచ్‌వీ స్వర్ణలత, హెల్త్ అసిస్టెంట్ జగదీశ్వర్‌రెడ్డి, ఏఎన్ఎం భారతి, ఆశ కార్యకర్త పాల్గొన్నారు.

‘ఎస్సీ, ఎస్టీలను మోసగిస్తున్న కాంగ్రెస్’

ఆదిలాబాద్: ఎస్సీ, ఎస్టీలను కాంగ్రెస్ మోసగిస్తుందని బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సుభాష్ అన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ రిజర్వేషన్లపై చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ మంగళవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ లో ఆందోళన నిర్వహించారు. రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేసేందుకు ప్రయత్నం చేయగా పోలీసులు అడ్డుకున్నారు. రాహుల్..దళిత సమాజానికి బహిరంగ క్షమాపణ చెప్పాలన్నారు. పార్టీ ఎస్సీ మోర్చా జిల్లా ఇన్ చార్జి సందీప్, దమ్మ పాల్, బండారి అశోక్, దేవన్న, సునీల్, విజయ్, కిషోర్, సంజీవ్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ఎదులాపురం: పట్టణంలోని భగత్‌సింగ్ నగర్‌లో సమస్యలు పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేశ్ అన్నారు. మంగళవారం కాలనీలో వారు మాట్లాడారు. వార్డులో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. స్థానిక ప్రజాప్రతినిధులు కాలనీ అభివృద్ధిని విస్మరించారని విమర్శించారు. ఆర్.మంజుల, శాఖ కార్యదర్శి అన్నమొల్ల పోసాని, ప్రభు, రేణుక, శ్రియాబాయి, ఉస్మాన్ పాల్గొన్నారు.

భవన నిర్మాణ మంజూరుపత్రం అందజేత

బోథ్: సొనాల గ్రామంలో మున్నూరుకాపు సంఘం మొదటి అంతస్తు భవన నిర్మాణానికి రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర ఇటీవల రూ.10 లక్షల నిధులను మంజూరు చేశారు. ఈ మంజూరు పత్రాన్ని మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ మంగళవారం మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు ఈర్ల నడిపి బాపునకు అందజేశారు. సభ్యులు ముత్తన్న, విఠల్, భూమన్న, తదితరులు ఉన్నారు.

పరామర్శ

తలమడుగు: ఖోడద్ గ్రామానికి చెందిన రుతుజారెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మంగళవారం పరామర్శించారు. మండల కన్వీనర్ వెంకటేశ్, నాయకులు తిరుమల గౌడ్, తుల శ్రీనివాస్, మొట్టె కిరణ్ కుమార్, కేదారేశ్వర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

బోథ్: మండలంలోని సొనాల గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అల్లా బకాష్ ఇటీవల మృతిచెందాడు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ మంగళవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. సొనాల పట్టణ అధ్యక్షుడు అనిల్, కాంగ్రెస్ సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ రమేశ్, నాయకులు గాజుల పోతన్న, కసిరే పోతన్న, అమత్‌రావు పాటిల్, యూత్ అసెంబ్లీ అధ్యక్షుడు పోతారెడ్డి ఉన్నారు.

అంబులెన్స్ వాహనాల తనిఖీ

ఉట్నూర్‌రూరల్/ఇంద్రవెల్లి: ఉట్నూర్, ఇంద్రవెల్లి, నార్నూర్, గాదిగూడలో అంబులెన్స్ వాహనాలను ఉమ్మడి జిల్లా ప్రోగ్రాం మేనేజర్ సామ్రాట్, హైదరాబాద్ నుంచి వచ్చిన క్వాలిటీ ఆడిటర్ కిశోర్ మంగళవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. గిరిజన ప్రాంతాల్లో 108,102 అంబులెన్స్ సిబ్బంది సేవలందించాలన్నారు. జిల్లా మేనేజర్ రాజశేఖర్ ఉన్నారు.

గంజాయి విక్రేత అరెస్టు

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని లాండసాంగ్వి శివారు ప్రాంతంలో మంగళవారం గంజాయి విక్రేతను అరెస్టు చేసినట్లు ఎస్సై ముజాహిద్ తెలిపారు. గ్రామానికి చెందిన షేక్‌చాంద్ మహారాష్ట్ర నుంచి గంజాయి తీసుకువచ్చి చిన్న ప్యాకెట్లలో నింపి విక్రయించేందుకు తరలిస్తుండగా పక్కా సమాచారంతో దాడిచేసి పట్టుకున్నామన్నారు. ఆయన వద్ద నుంచి రూ.3వేల విలువ చేసే 30 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఐద్వా మహాసభలు విజయవంతం చేయాలి

ఎదులాపురం: జిల్లాకేంద్రంలో బుధవారం నిర్వహించే అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా నాలుగవ మహాసభలను విజయవంతం చేయాలని ఐద్వా జిల్లా కార్యదర్శి లంక జమున కోరారు. జిల్లా కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై మహాసభలో తీర్మానం చేయనున్నట్లు తెలిపారు. అదేవిధంగా నూతన జిల్లా కమిటీని ఎన్నుకోనున్నారని పేర్కొన్నారు. సమావేశంలో శకుంతల, మంజుల, పంచ పూల, విజయ, పోచక్క తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు బస్‌పాసులు పంపిణీ

ఇంద్రవెల్లి: ఆర్టీసీ ఆధ్వర్యంలో దివ్యాంగులకు 50 శాతం రాయితీపై అందిస్తున్న బస్ పాసులను సద్వినియోగం చేసుకోవాలని ఆ సంఘం జిల్లా కోఆర్డినేటర్ ప్రమోద్‌కుమార్ కోరారు. మండలంలోని రాంనగర్‌లో ఉట్నూర్ ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో మంగళవారం దివ్యాంగులకు బస్‌పాస్ పంపిణీ చేశారు. ఇంద్రవెల్లి మేజర్ పంచాయతీ మాజీ సర్పంచ్ కోరెంగా సుంకట్‌రావ్, కండక్టర్ ప్రకాశ్, దివ్యాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ముత్యాల సురేశ్, డివిజన్ అధ్యక్షుడు సోన్‌కాంబ్లే దేవిదాస్ ఉన్నారు.

ఖమ్మం వరద బాధితుల కోసం విరాళాల సేకరణ

ఆదిలాబాద్: జిల్లా నిరుద్యోగ కళాకారుల ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలో ఖమ్మం వరద బాధితుల కోసం విరాళాల సేకరణ చేపట్టారు. డప్పుకొడుతూ, ఖమ్మం వరద బాధితుల సహాయార్థం ముందుకు రావాలని పట్టణంలో అవగాహన కల్పించారు. పలువురు దాతల నుంచి విరాళాలు సేకరించి, సీఎం సహాయనిధికి పంపిస్తామన్నారు. కళాకారుల సంఘం సమన్వయకర్త సంతోష్, గౌరవ అధ్యక్షుడు లక్ష్మణ్, కన్వీనర్ దత్తు, కళాకారుల వినోద్, స్వరాజ్, విలాస్, రాకేశ్, జగదీశ్, దత్తు తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతోనే ఆరోగ్యం

నార్నూర్(గాదిగూడ): ప్రతి ఒక్కరూ పోషకాహారం తీసుకోవడంతోనే ఆరోగ్యంగా ఉంటారని జిల్లా సంక్షేమాధికారి సబిత తెలిపారు. గాదిగూడ మండలం లోకారి(కే) గ్రామంలో మంగళవారం నిర్వహించిన పోషణమాసం కార్యక్రమంలో సీడీపీవో శారద, తహసీల్దార్ విజయనందం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, గర్భిణులు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ సభ్యత్వ నమోదు

ఆదిలాబాద్: బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చిట్యాల సుహాసినిరెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని కైలాస్ నగర్ కాలనీలో మంగళవారం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. కాలనీలోని అభయాంజనేయ స్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. నాయకులు లాలామున్న, రాకేశ్, ప్రవీణ్ అగర్వాల్, పవన్ తదితరులు ఉన్నారు.

బజార్‌హత్నూర్: మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు పోరెడ్డి శ్రీనివాస్ ఆధ్వర్యంలో బీజేపీ సభ్యత్వ నమోదు చేపట్టారు. ప్యాక్స్ చైర్మన్ వెంకన్న, గణేశ్, శంకర్, రమణ, నందినర్సయ్య, ఉత్తం, రాకేశ్ పాల్గొన్నారు.

నేరడిగొండ: కుప్టి, కుమారి, తర్నం, గాజిలి గ్రామాల్లో బీజేపీ సభ్యత్వ నమోదు చేపట్టారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, మండల అధ్యక్షుడు సంతోష్ సింగ్, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ పటేల్ పాల్గొన్నారు.

నార్నూర్: మాలేపూర్, ఉమ్రి, మల్లెంగి గ్రామాల్లో బీజేపీ సభ్యత్వ నమోదు చేపట్టారు. భిక్షపతి రాథోడ్, శేషారావు రాథోడ్, దేవిదాస్ తదితరులు ఉన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ఆదిలాబాద్
99516 02888
99122 20764
Office mail : nzbadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఆదిలాబాద్ : కె.రమేష్ - 8019715058
బోథ్ : ఖాజా మొయినోద్దీన్ - 7997958184
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899